25.

# సమిష్టియందు, వ్యష్టియందు ఏకత్వాన్ని గుర్తించాలి

ఆకాశామల గాత్రం దైవం తారాశశి రవి నేత్రం దైవమ్
వ్యాపక పవన శ్వశితం దైవం పారావార స్వేదం దైవమ్

ప్రేమస్వరూపులారా!

నమ్మక చెడినవారలున్నారు కాని నమ్మి చెడినట్టివారు ఈ లోకాన లేరు లేరు. ప్రాచీన కాలమునుండి అనేకమంది మహర్షులు, మహనీయులు అనేక సాధనలు సల్పి, దైవనిమిత్తమై కాలంను సార్థకం చేసుకుంటూ వచ్చారు. బ్రహ్మజ్ఞానంను పొందగోరి ఆత్మజ్ఞానంను ఆశించి అనేకమంది కూడను, అనేక విధములైనటువంటి ప్రదేశములు తిరిగి, మహనీయులను దర్శించి ప్రబోధలు వింటూ వచ్చారు. బహుళ గ్రంథపరిచయము జ్ఞానం కానేరదు. లేక చరాచర ప్రపంచమంతయును ఒక్కసారి గుర్తించి, దానిని తెలుసుకున్నంత మాత్రమున జ్ఞానం కాదు. నిజమైన జ్ఞానం ఏమిటి? సమిష్టియందు, వ్యష్టియందు ఉండినటువంటి ఏకత్వాన్ని గుర్తించినటువంటి వాడే నిజమైన జ్ఞాని. కాని, ఈనాడు మానవుడు తనయందు ఉన్నటువంటి దైవత్వాన్ని ఏ రీతిగా గుర్తించగలడు. మానవత్వాన్నే గుర్తించుకోలేనటువంటి పరిస్థితుల్లో, తనయందు ఉన్నటువంటి దైవత్వాన్ని ఏ రీతిగా గుర్తించగలడు? మానవత్వాన్ని గుర్తించు కోలేనటువంటి వ్యక్తి, దైవత్వాన్ని ఏరీతిగా గుర్తించగలడు? కనుకనే, తరములు కదిలినా, యుగములు మారినా మానవుడు తన తత్వంను ఏమాత్రంను కూడను మార్చుకొనుటకు ప్రయత్నించుట లేదు. ఆత్మజ్ఞానమును కాని, లేక బ్రహ్మజ్ఞానంను కాని గ్రంథములు మనకు బోధించ లేవు. లేక మహనీయులు ఎవరైనా కూడా మనకు అందించలేరు. గురువు దీనిని చక్కని మార్గంలో మనకు ప్రబోధించలేడు. కారణం ఏమిటి? జ్ఞానం. ఈ ఆత్మతత్వం బాహ్య - ప్రపంచం నందు మనకు కానరాదు. గ్రంథములయందు నిరూపించుటకు ఆధారం లేదు. తన హృదయం నుండియే ఆవిర్భవించాలి. కనుకనే తనయందే ఉండినటువంటి జ్ఞానతత్వాన్ని బయట వెతకటము ఒక్క పెద్ద అజ్ఞానం. బుద్ధుడు ఈ విధమైనటువంటి ఆలోచన చేతనే 6

సంవత్సరములు కాలమును సద్వినియోగ పరచాలని ప్రయత్నించాడు. అన్ని గ్రంథములు చదివాడు. మహనీయులను దర్శించాడు. వారి ప్రబోధలను చక్కగా శ్రవణం చేశాడు. కాని, కట్టకడపటికి ఇవి ఏవి కూడను నిజమైనటువంటి జ్ఞానాన్ని అందించలేవు అనే సత్యాన్ని గుర్తించాడు. తనయందే గుణంగా ఉన్నటువంటి జ్ఞానం, తనయందే అజ్ఞాతంగా నిలిచినటువంటి ఈ జ్ఞానంను బాహ్యప్రపంచంనందు ఉన్నటువంటి వ్యక్తులు ఏ రీతిగా బోధించగలరు? కనుకనే తన జ్ఞానంను, తన ఆత్మానందమును తానే గుర్తించాలని గొప్ప తపస్సు చేశాడు. తన దృష్టిని అంతర్ముఖం గావించాడు. బహిర్ముఖదృష్టిని కూడను పూర్తి స్తంభింప చేశాడు. క్రమేణ తననుండి ఒక ఆత్మ జ్ఞానం ఆవిర్భవిస్తూ వచ్చింది.

**త్రిశరణములు**

అప్పుడే 'బుద్ధం శరణం గచ్ఛామి' అన్నాడు. 'సంఘం శరణం గచ్ఛామి' తరువాతనే 'ధర్మం శరణం గచ్ఛామి' అనగా తనయందు ఉన్నటువంటి ఆత్మజ్ఞానంను బుద్ధి ద్వారా తాను వినియోగించుకున్నాడు. బుద్ధిద్వారా ఆవిర్భవించినటువంటి జ్ఞానంను సంఘంలో ప్రవేశపెట్టాడు. సంఘంలో ప్రవేశపెట్టినటువంటి ఈ జ్ఞానంను, ధర్మం ద్వారా ఆచరించడానికి ప్రయత్నించాడు. కనుక, మానవుడు జ్ఞానంను పొందాలనుకుంటే, గ్రంథ పరిచయం ద్వారా జ్ఞానంను ఏనాటికిని పొందలేడు. ఇవన్నియును కేవలం కాలం వ్యర్థం గావించుకొనే నిమిత్తమై చేసేటటువంటి పనులే. అంతఃకరణం పరిపూర్ణంగా అభివృద్ధి గావించుకున్నప్పుడే, ఆత్మజ్ఞానం మనకు లభ్యమవుతుంది. సమస్త శక్తి కూడను మానవునియొక్క అంతఃకరణయందే ఇమిడి ఉంటున్నవి. మానవుడు ఇట్టి అంతఃకరణ ఆనందంను, అనుభవించగోరి అనేక చదువులు చదువుతున్నాడు. ఈ చదువులు ద్వారా మనకు జ్ఞానం లభిస్తుంది అని ఆశిస్తూ వస్తూ ఉన్నాడు. కాని, తదుపరి అధికారం చేతనే జ్ఞానం లభిస్తుంది అని అధికారంలో ప్రవేశించాడు. తదుపరి, గృహస్థ మార్గంలోపల ఈ జ్ఞానం అనుభవించ వచ్చునని తాను ప్రయత్నించాడు. సర్వములు త్యాగం చేసుకొని, కేవలం తపస్సునకు ప్రవేశపెట్టాడు. ఎన్ని విధములైనటువంటి సాధనలు ప్రయత్నం చేసినప్పటికిని తననుండి ఈ జ్ఞానం ఆవిర్భవించుట లేదు. మానవుడు అనుభవించవలసినటువంటి ఆనందం చదువులలోనే లేదు. కేవలం తపస్సులో లేదు, లేక

srisathyasaivachanamrutam

గృహస్థధర్మంలో లేదు. సర్వ సంగ పరిత్యాగంలో లేదు.

**న తపాంసి న తీర్థాని న శాస్త్రాణి జపా నహి**
**సంసారసాగరోద్ధారే సజ్జనా సేవనం వినా.**

తపస్సుద్వారా, ధ్యానంద్వారా, జపంద్వారా, ఈ ఆనందం మనకు లభ్యం కాదు. ఇవన్నీ కూడను కాలం సద్వినియోగం గావించుకొనేటటువంటి నిమిత్తమై జీవించినటువంటి సత్కర్మలే. మానవుని హృదయంనందు ఉన్నటువంటి శక్తి, ఏ ప్రదేశమునందు కూడను మనకు కానరాదు. మానవునియందు అనేక విధములైనటువంటి అజ్ఞాతశక్తులు ఇమిడి ఉంటున్నావి. మానవునియొక్క శరీరమే ఒక పెద్ద జనరేటర్. మానవునియొక్క హృదయమే పెద్ద మాగ్నెట్. మానవునియొక్క ఆలోచన శక్తియే గొప్ప కరెంటు. కనుకనే, ఈ విధమైనటువంటి సర్వశక్తులు కూడను మానవనియందే ఇమిడి ఉంటున్నావి. కనుకనే, కట్టకడపటికి బుద్ధుడు ఏమి నిర్ణయం చేసుకున్నాడు? భగవంతుడు అందించినటువంటివి ఐదు కర్మేంద్రియములును, ఐదు జ్ఞానేంద్రియములను సద్వినియోగ పరచినపుడే మనకు సరియైన ఆనందం లభిస్తుంది అని విశ్వసించాడు. కనుకనే, మొట్టమొదట తాను సమ్యక్ దృష్టి అనేటటువంటి దాన్ని ప్రారంభించాడు. దేనిని మనం చూతుమో ఆ చిత్రం మన హృదయంలో హత్తుకొని పోతుంది. కనుక మనం చెడ్డ దృశ్యములు చూడకూడదు. ఈ చెడ్డ దృశ్యములు అన్ని కూడను మన హృదయంలో చిత్రించుకొని పోతుంటాయి. వాటిని తిరిగి మనం వేరు చేయుటకు ఏ విధంగా ప్రయత్నం చేసినప్పటికి సాధ్యం కాదు. కనుకనే, సత్యమైనటువంటి, న్యాయమైనటువంటి, పవిత్రమైనటువంటి వస్తువులను, విషయములను మాత్రమే మనం చూడాలి. 'దృష్టి ఎట్టిదో-సృష్టి అట్టిది'. కనుకనే సమ్యక్ దృష్టిని మనం ఈనాడు అభివృద్ధి పరుచుకోవాలి. అనగా సమత్వమైన, పవిత్రమైన, సార్థకమైన దృష్టిని మనం పోషించాలి. ఇంకేమైనా దుష్టభావములు మన చిత్రంలో నాటుకుంటు పోయినప్పుడు వాటిని మనం దూరం చేయుటకు వీలుకాదు. కనుకనే సమ్యక్ దృష్టి కోసమని సమ్యక్ సంగం కలగాలి. కనుకనే ఈ సమ్యక్ సంగం కలిగినప్పుడే మానవునికి సమ్యక్‌కర్మ ఏర్పడుతుంది. మనము దుష్టసంఘంతో చేరి, దుర్మార్గులతో చేరి, దుష్ప్రవర్తనలో చేరి మన జీవితంను అనేక విధములుగా కూడను పాడు

srisathyasaivachanamrutam

చేసుకుంటున్నాము.

**త్యజ దుర్జన సంసర్గం భజ సాధుసమాగమమ్**
**కురు పుణ్యమహోరాత్రం స్మర నిత్యమనిత్యతాం.**

మొట్టమొదట మనం సత్సంగాన్ని మనం అభివృద్ధి పరుచుకోవాలి. సత్సంగం అనగా ఏమిటి? శాశ్వతమైన, త్రికాలాబాధ్యమైనటువంటి తత్వమునే సత్సంగం అంటారు. ఏదో పదిమంది మంచివారితో చేరటం సత్సంగం కానేరదు. సత్ అనగా శాశ్వతం. ఎలాంటి పరిస్థితులయందు కూడను అది మార్పు చెందనటు వంటిది. అదియే దైవత్వం. కనుకనే దైవత్వాన్ని 'సచ్చిదానందం' అన్నారు. అట్టి సచ్చిదానంద స్వరూపుని సంఘంలో మనం ప్రవేశించాలి. అట్టి సమ్యక్ దృష్టిని మనం పోషించుకోవాలి. అట్టి సమ్యక్‌దృష్టి వల్లనే సమ్యక్ భావాలు మనలో అభివృద్ధి అవుతూ వస్తుంది. ఆ సమ్యక్ భావం మనలో ఆవిర్భవించినపుడే సమ్యక్ శ్రవణంగా ఏర్పడుతుంది. సమ్యక్ శ్రవణం ఏర్పడినపుడే సమ్యక్ కర్మలు మనం చేస్తుంటాము. కనుకనే త్రికరణశుద్ధికి ఈ మూడు కూడను అత్యవసరం. దీనినే మానవత్వం అని చెప్తూ వచ్చారు. The proper study of mankind is man. ఏమిటి ఈ proper study of mankind? పవిత్రమైన భావములు, పవిత్రమైన పలుకులు, పవిత్రమైన కర్మలు. ఈ మూడింటి ఏకత్వం చేతనే త్రికరణ శుద్ధి ఏర్పడుతుంది. ఈ త్రికరణశుద్ధితో వచ్చినటువంటి తత్వమే నిజమైన దైవత్వం. కనుక మనలోని భావములు, మనలోని పలుకులు, మనం చేసే పనులు ఈ మూడు కూడను సమ్యక్‌దృష్టి, సమ్యక్ భావం, సమ్యక్ కర్మ. ఈ మూడింటి ఏకత్వం మనం ఏర్పరచుకోవాలి. ఈ మూడింటి ఏకత్వం చేతనే మానవుడు తన దివ్యత్వాన్ని తాను తెలుసుకోగలడు. ఈ సత్యాన్ని గుర్తించినటువంటి బుద్ధుడు కట్టకడపటికి ఆనందంను నోచుకోగలిగాడు. ఇంకా కొన్ని క్షణములకు తాను నిర్వాణంను పొందేటటువంటి పరిస్థితి ఏర్పడుతున్నాది. బుద్ధుడు పుట్టినటువంటి తొమ్మిదవ దినమే తనయొక్క తల్లి అయినటువంటి మాయాదేవి మరణించింది.

**ఆచరణలేని చదువులు నిరర్థకములే**

మాయాదేవి మరణించిన తక్షణమే గౌతమి అనే తన పినతల్లి బుద్ధుడిని సాకుతూ

sri sathyasai vachanamrutam

వచ్చింది. ఆ తల్లి చాలా ప్రేమతో బుద్ధుడిని పోషిస్తూ వచ్చింది. కనుకనే ఆ బుద్ధునికి గౌతమ అని పేరు పెట్టారు. అనగా పెంచి పెద్ద చేసినటువంటిది ఆమె కనుక ఆమె పేరు ఈయనకు సార్థకం కావాలని ఆ పేరు అతనికి పెట్టారు. కనుక బుద్ధుడు ప్రతి ఒక్క విషయానికి కూడను తన అంతఃకరణంనుండి ఆవిర్భవింపచేసుకొంటూ వచ్చాడు. బాహ్యమైన గురువులుగాని, బాహ్యమైన జగత్ పదార్థములు గాని, బాహ్యమైనటువంటి గ్రంథములయొక్క పరిచయము కాని ఇందులో ఏమాత్రముకూడను సరియైనటువంటి జ్ఞానంను అందించవని తాను నిర్ణయము చేసుకున్నాడు. ఆత్మ బోధనలు సల్పినటువంటి వారు అనేకమంది ఉంటున్నారు, జగత్తులో. కాని, ఒక్కరైనా ఆచరించి, ఆనందించి నటువంటి వారు కనిపించుట లేదు. కనుకనే, ఎన్ని తెలుసుకొని ప్రయోజనం ఏమిటి? ఎన్ని గ్రంథములు వ్రాసి ప్రయోజనం ఏమిటి? ఎన్ని గ్రంథములు చదివి ప్రయోజనం ఏమిటి? ఆచరించలేనటువంటివి చదివి మనం అన్ని కూడను వ్యర్థం చేసుకుంటున్నాము. కనుకనే ఈ conscience ని ఫాలో చెయ్యి. అదియే నీ నిజమైనటువంటి తత్వం. అదియే నీ నిజమైనటువంటి గురువు. కనుక తన భావములను విచారణ చేసుకుంటూ, అన్నింటిని కూడను తననుండి ఆవిర్భవింప చేసుకొంటూ వచ్చాడు. కాని, నిర్వాణ సమయంనందు ఎదురుగా కూర్చొన్నటువంటి పినతల్లి కుమారుడైనటువంటి ఆనందుడు కంటిధారలు కారుస్తూ వచ్చాడు. ఆ ఆనంద్‌ను దగ్గరకు పిలిచి, ఆనందా! ఈనాటి వరకు జగత్తు సత్యాన్ని గుర్తించకోలేక పోతుండాది. మరణించేటటువంటి వారిని చూసి దుఃఖించేటటువంటి వారు వేలకు వేలు ఉంటున్నారు. కాని, ఆ మరణించేటటువంటి వ్యక్తి, ఏ పవిత్రమైనటువంటిది పొందగల్గుతున్నాడో అనేటటువంటి సత్యాన్ని విచారించుకోలేక పోతున్నారు. నేను సత్యాన్ని గుర్తించాను. ఆ సత్యంలో నేను లయమై పోతున్నాను. దీనికి నీవు చూసి కంటినీరు పెట్టటం ఎంత అన్యాయం? నా పవిత్రస్థితికి నీవు దుఃఖించినట్టుగా కనిపిస్తుంది. మానవుడు ఎవ్వరు కూడను అంత్యసమయములోపల కంటిధారలు కార్చకూడదు. కనుకనే నారములనగా నీరు, నయనములనగా కన్నులు, కన్నులలో నీరు కేవలం నారాయణునికి మాత్రమే వదలాలి కాని, అన్య పదార్థములకు కాని, అన్య విషయములకు కాని ఏమాత్రం మన నారములు వదలకూడదు. దైవత్వంనకై ఆనందబాష్పములు విడచాలి. శోకబాష్పం



srisathyasaivachanamrutam

మానవునికి ఏమాత్రం కూడను సరియైనటువంటి ధర్మం కాదు.

**మానవునికి ఆనందం సహజ లక్షణం**

ఒక చిన్న ఉదాహరణము. మనము బజారులో వెళ్తున్నప్పుడు ఒకడు పాపం గట్టిగా ఏడుస్తున్నాడు. అతని దగ్గరకు అందరు గుంపుగా చేరి, ఎందుకు ఏడుస్తున్నావు? ఏ కారణం చేత ఏడుస్తున్నావు? అని అందరు ప్రశ్నిస్తూ వచ్చారు. అదే బజారులోపల మరొకడు ఆనందంగా గంతులు వేస్తూ సంతోషాన్ని అనుభవిస్తున్నాడు. కాని ఏ మానవుడు కూడను ఆనందంగా గంతులు వేసేటటువంటి వ్యక్తి దగ్గరకు పోయి, అయ్యా! నీవు ఆనందంగా ఉన్నావు. ఎందుకు ఏడ్చుటం లేదు? అని ఎవరు ప్రశ్నించరు. అనగా ఆనందం మానవునియొక్క సహజం. మానవుడు ఆనంద పిపాసి. దుఃఖం అనేటటువంటిది మానవునికి చాలా విరుద్ధమైనటువంటిది. మానవుడు ఏ విషయంనందు కూడను దుఃఖించడానికి ప్రయత్నించుకూడదు. దుఃఖము ఒక బలహీనత. కనుక ఇట్టి బలహీనతకు మనం అవకాశం ఇచ్చుట చేతనే అనేక జన్మలనుంచి మనం దుఃఖములోనే మునిగి పోతున్నాము. కనుక మనం దుఃఖమునకు ఏమాత్రం అవకాశం ఇవ్వకూడదు. దైవత్వాన్ని చక్కగా విశ్వసించినటువంటి వాడికి, దుఃఖమే లేదు. కనుకనే, దుఃఖించేటటువంటి వాడు కేవలం దైవతత్వాన్ని పరిపూర్ణంగా గుర్తించలేదని అర్థం. దైవం ఒక్కడే. అనేక రూపనామముల చేత మనకు గోచరిస్తున్నాడు. కాని దైవం ఒక్కడే. అట్టి దైవత్వాన్ని మనం ఒక్కటిగా గుర్తించుకొనలేక పోవడం చేతనే అనేక విధములైనటువంటి అపోహలకు గురి అవుతున్నాము. రామ, కృష్ణ, అల్లా, బుద్ధ ఇటువంటి పేర్లతో మనం ఆరాధన చేస్తున్నాము. కాని, ఈ పేర్లంతా కూడను మనం పెట్టుకున్నవే కాని, తాను పుట్టిన తర్వాత వచ్చినవి కాదు. కనుక ఈ పెట్టిన పేర్లు మనం అనుభవించేటటువంటి అనుభూతులు ఆధారము అని భావిస్తున్నాము. ఇవన్నీ కూడను క్షణభంగురాలే!

**మా కురు ధన జన యౌవనగర్వం హరతి నిమేషాత్ కాలః సర్వమ్**
**మాయామయమిదమఖిలం హిత్వా బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా.**

కనుక ఈ విధమైనటువంటి దుఃఖములకు మనం అవకాశంను అందించకూడదు. నీటి బుడగపై నిలిచినది ఈ దేహం. ఈ నీటి బుడగపై నిలిచినటువంటి ఈ దేహం ఎంతకాలం

sri sathyasai vachanamrutam

ఉండగలదు? కనుక ఇవన్నీ క్షణభంగురాలే. మనకు కావలసినటువంటిది ఆనందమైన, సత్యమైనటువంటిది. కనుకనే ఆనందం ఎక్కడనుంచి వస్తుంది? ఈ సంతోషం ఆనేటటువంటిది సర్వములు తెలుసుకొనేటటువంటి వారికి లభ్యమవుతున్నది. Happiness is union with GOD. అలాంటి దైవం దగ్గరనే ఈ ఆనందముంటుంది. ఈ ఆనందము బయట ప్రపంచంలో మనకు లభ్యమయ్యేటటువంటిది కాదు. ఎవరు కూడను మనకు అందించలేరు. తనకు తానే అభివృద్ధి పరచుకోవాలి. ఇట్టి అభివృద్ధి పరచుకోవలసినట్టి ఆనందాన్ని ఏది ఎవరి దగ్గరో పొందుతామని ఆశించుకోవడం అదే పెద్ద అజ్ఞానం. ఈ విధమైనటువంటి అజ్ఞానానికి తాను చాలా బాధ పడ్డాడు బుద్ధుడు. ఎన్ని విధములైనటువంటి సాధనలో చేశాడు. కట్టకడపటికి తాను ఒక నిర్ణయాన్ని తీసుకున్నాడు. బుద్ధ గయకు వెళ్ళి, అక్కడ తనయందు ఉన్నటువంటి అంతర్భావంయొక్క ఆనందాన్ని ఆవిర్భవింప చేసుకోవాలని సంకల్పించుకున్నాడు. అక్కడకు వెళ్లి ఈ ఆనందాన్ని అభివృద్ధి పరచుకున్నాడు. ఎవ్వరు దీనికి బాధ్యులు కారు. ఎవరు ఇది ఇచ్చేటటువంటిది కాదు. ఎక్కడా మనం తెచ్చుకొనేటటువంటిది కాదు. కేవలం తనయందే ఉన్నటువంటి ఆనందాన్ని మనం మర్చిపోయి, అనేక ప్రాంతములు మనం వెతుకుతున్నాము. కనుకనే, ప్రతి మానవునియొక్క హృదయ స్థాయే నిజమైన భగవంతుని స్థాయి. అట్టి స్థానాన్ని మనం భద్రంగా తీసుకొని, అట్టి స్థానమును మన జన్మ స్థానంగా విశ్వసించి, ఆ హృదయాన్ని మనము అభివృద్ధి పరుచుకోవటానికి తగిన కృషి చేయాలి. సక్రమమైనదిగా లేకపోవటం చేతనే బుద్ధమతం క్రమక్రమేణా చలిస్తూ వచ్చింది. "చెప్పటం ఒకటి-చేయటం మరొకటి". కనుకనే, ఈ మతములన్ని కూడను క్రమక్రమేణ సన్నగిల్లుతు పోయినాయి. చెప్పినవి మనం ఆచరించడానికి ప్రయత్నించాలి. తెలుసుకున్నటు వంటి సత్యాన్ని మనం ఆచరణలో పెట్టాలి. అప్పుడే మనకు సరియైనటువంటి సత్యం మనకు గోచరిస్తుంది. ఈనాడు తెలుసుకున్నటువంటి విషయాన్ని మనము నిత్యజీవితంలో అనుభూతికి తెచ్చుకోవటం లేదు. కనుక ఈనాడు "చెప్పవచ్చు కోటి-చెయ్యరు ఒక్కటి". కనుకనే ఈనాటి ప్రపంచం ఇన్ని విధములైనటువంటి అవస్థలకు గురి అవుతూ వస్తుంది. దైవత్వాన్ని మనం వెతకనక్కర లేదు. ప్రతి ఒక్కరి హృదయంనందు కూడను నిత్యం ప్రకాశంగా ఉంటున్నాది. ఆ

srisathyasaivachanamrutam

ప్రకాశవంతమైనటువంటి దివ్యజ్యోతియే దైవత్వం. ఎక్కడో బయట ప్రపంచంలో లేదు.

**దేవుడనగ వేరు దేశమందున లేదు**
**దేవుడుండు తనదు దేహమందె**
**పాపమనగ వేరు పరదేశమున లేదు**
**తానుచేయు పనుల తగిలియుండు**

పుణ్యము కాని, పాపము కాని మన కర్మలయందే ఇమిడి ఉంటున్నాది కాని ప్రత్యేకంగా వచ్చేటటువంటివి కాదు.

**అన్ని మతాలు మంచినే బోధించాయి**

**మతములన్ని చేరి మంచినే బోధించె**
**తెలిసి మెలగ వలయు తెలివితోడ**
**మతులు మంచివైన మతమేది చెడ్డది**
**వినుము భారతీయ వీరసుతుడ!**

ఈనాడు మతం చెడ్డది అనేటటువంటివారు అంతా తమ మనస్సే చెడ్డది అని గ్రహించాలి. కనుక ఈనాడు మనస్సును పవిత్రం గావించుకోవాలి. మనస్సును సక్రమమైన మార్గంలో ప్రవేశపెట్టాలి. సమ్యక్ దృష్టిలో దీనిని ప్రవేశపెట్టాలి. సమ్యక్ భావములో దీన్ని ఆరితేర్చాలి. సమ్యక్ శ్రవణం చేయాలి. సమ్యక్ భావంలో మనం మునిగి పోవాలి. ఈ సమ్యక్ కర్మలు ఆచరిస్తూ రావాలి. కనుక బుద్ధుడు చెప్పినటువంటివి ఐదే ఐదు కర్మలు. సమ్యక్ దృష్టి, సమ్యక్ భావం, సమ్యక్ శ్రవణం, సమ్యక్ వాక్కు, సమ్యక్ కర్మ. ఈ ఐదింటి ద్వారానే పంచభూతములు సక్రమంగా పనిచేస్తాయి. దైవం ఇచ్చినటువంటి ఈ పంచభూతములు సార్థకం గావించుకోవటమే నిజమైన సాధన. కాని, భగవంతుడు ఇచ్చినటువంటి మతి, గతి, స్థితి, సంపత్తిని మనం దుర్వినియోగం చేసుకుంటున్నాము.

ఈ కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సర్యములు అంతా అభివృద్ధి పరుచుకుంటున్నాము. ఈ కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సర్యములంతా భగవంతుడు ఇచ్చినవి కాదు. మన తిండి, తీర్థాదులతో మనం పెంచుకున్నటు వంటివి.

sri sathyasai vachanamrutam

కనుక ఇవన్నీ కూడను కేవలం మృగలక్షణాలు. ఇవన్నీ కేవలం పశులక్షణాలు. ఈ పశులక్షణాల్ని మనం పవిత్రం గావించాలి. దివ్యమైనటువంటి దైవ లక్షణాన్ని మనం పోషించుకోవాలి. సత్యంగా జీవించాలి. 'సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్, నబ్రూయాత్ సత్యమప్రియం'. సత్యం బ్రూయాత్ ఇదే గౌరవమైనటువంటి జీవితం. ఇదియే నైతిక జీవితం. సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్. ప్రియం ధార్మికమైనటువంటిది. నబ్రూయాత్ సత్యంమప్రియం ఇదియే ఆధ్యాత్మిక మార్గము. ఇక్కడ నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక మార్గములు అన్నీ కూడను సత్యంలోనే ఇమిడి ఉంటున్నాయి.

**సత్యంబునందుండి సర్వంబు సృష్టించె**
**సత్యమందణగెను సర్వ సృష్టి**
**సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న**
**శుద్ధసత్త్వమిదియె చూడరండి.**

కనుకనే, భారతీయ సంస్కృతియందు మొట్టమొదట 'సత్యంవద-ధర్మంచర'. ఏ రీతిగానైన, ఏ మతము వారైనా కూడను సత్యాన్ని పలకటం చాలా గొప్పది. ఎలాంటి పరిస్థితులందునైనను కూడను సత్యాన్ని మనం ఉచ్చరించాలి. సత్యమే మనకు దైవం. ఇది ప్రత్యక్షదైవం. ధర్మమే మనకు పరోక్షమైనటువంటి నీడ. ఈ రెండింటిని ఆధారం చేసుకున్నప్పుడే మనయొక్క దివ్యత్వాన్ని మనం చక్కగా దర్శించవచ్చును. మానవునియందే సర్వశక్తులు ఇమిడి ఉంటున్నాయి. కాని, తన దృష్టిని అంతర్ముఖం గావించుకున్నప్పుడే ఆనందంగా తాను జీవించవచ్చు. కాని, దురదృష్టవశాత్తు మన దృష్టిని అంతా బహిర్ముఖమే చేసుకుంటున్నాము.

**పశులక్షణాలను వీడి దివ్యత్వాన్ని పొందాలి**

కనుకనే వేదం చెప్తుంది. పశ్యతీతి పశువు. బయట దృష్టంతా పశులక్షణములే. ఈ పశులక్షణాన్ని మనం దూరం చేసుకున్నప్పుడే పశుపతి లక్షణాలు మనలో ఆవిర్భవిస్తాయి. కనుక, మనం దివ్యమైనటువంటి భావాలు మన హృదయంనుండి మనం ఆవిర్భవింప చేసుకోవాలి. దైవంకంటే మించినటువంటిది జగత్తులో మరొకటి లేదు. అందరి హృదయంనందు కూడను దైవత్వం ఉంటున్నాది. దైవభావానికి ప్రయాణం చేసేటటువంటి

sri sathyasaivacharamrutam

వారికి ప్రోత్సాహ, ఉత్సాహాలు అందించాలి. ఆనందము అనేటటువంటి వారికి అమితమైనటువంటి ఆనందాన్ని మనం అందించాలి. అంతే కాని నిరుత్సాహంను అందించకూడదు. విస్మయం చేకూర్చకూడదు. దివ్యమైన భావాలు ఎన్ని జన్మల యొక్క సుకృతం చేతనో లభ్యమవుతుంటాయి. కనుక దైవత్వం అనేటటువంటిది ఒక్క పవిత్రమైనటువంటి హృదయమునకు మాత్రమే సంబంధించినటువంటిది. ఇంకా మిగిలినవన్ని కూడను కదలిపోయే మేఘములు. వస్తుంటాయి, పోతుంటాయి. ఏవి కూడను సత్యంకాదు. ఏవి కూడను శాశ్వతంగా ఉండవు. అన్ని అశాశ్వతాలే; వస్తున్నాయి, పోతున్నాయి. కాని వచ్చి పెరిగేటటువంటిది ఒక్కటే దైవత్వమే. లౌకికమైనటువంటివి వచ్చి, పోయేవి. దివ్యత్వమే వచ్చి, పెరిగేది. ఆ దివ్యత్వాన్ని మనము ఈనాడు పవిత్రం గావించుకోవాలి.

**బుద్ధిని సక్రమంగా పెట్టుకున్నవాడే బుద్ధిష్ట్**

ప్రేమస్వరూపులారా! ఎంతో దూరంనుంచి మీరు ఇక్కడకు వచ్చారు. ఈ బుద్ధపౌర్ణమియొక్క ఆనందాన్ని అనుభవించాలని వచ్చారు. మీరు ఇక్కడకు రానక్కరలేదు. బుద్ధుడు అనగా మీ బుద్ధియొక్క స్వరూపమే! కనుకనే ఆ బుద్ధిని మనము సక్రమమైన మార్గంలో పెట్టుకోవాలి. ఆ బుద్ధిని సక్రమమైన మార్గంలో పెట్టుకున్నప్పుడే బుద్ధిష్ట్ అనేటటువంటిది సార్థకం అవుతుంది. కేవలం సాధనలు, సాధనలు, సాధనలు చేసి కేవలం సాధనల వల్ల మన కాలంను వ్యర్థం చేసుకుంటున్నాము. ఇదంతా కూడను waste of time. నీవు పవిత్రమైన భావాలను అభివృద్ధి పరుచుకో. నిజమైన సాధన ఏమిటంటే, దుష్టగుణములను దూరం చేసి సద్గుణములను పెంచుకోవటమే సాధన. కనుక, ఏ క్షేత్రం వెళ్ళినప్పటికిని నీ దుర్గుణములను విసర్జించండి. అక్కడ చిక్కినటువంటి పవిత్రమైన భావాలను పెంచుకోండి. ఆ దివ్యమైన భావాలు, భవ్యమైన భావాలు మానవుడు పెంచుకోవాలి.

**ఆత్మ సామ్రాజ్యమే నిజమైన నిర్వాణం**

దేహం నీటి బుడగ వంటిది. Body is like a water bubble, mind is like a mad

sri sathyasaivachanamrutam

monkey. Don't follow the mind, don't follow the body. Follow the conscience. దానిని మనం అనుసరించాలి. అదియే నిజమైనటువంటి సాధన. కాని conscience అనుభవించకుండా కాన్షియస్‌ను అనుభవిస్తున్నాము. కనుక conscience అనుభవించాలి. అదియే స్వరాజ్యం. ఆ స్వరాజ్యమే నిజమైన రాజ్యం. అదియే ఆత్మ సామ్రాజ్యం. అట్టి ఆత్మ సామ్రాజ్యమే నిజమైనటువంటి నిర్వాణం. నిర్వాణమనగా ఏమిటి? కేవలం అదియే మోక్షం అన్నారు. అటువంటి నిర్వాణాన్ని మనం తగినటువంటి రీతిగా సాధించాలి. నిర్వాణం అంటే ఏమిటి? అంత్య సమయములనందు ఆనందాన్ని అనుభవించటమే నిర్వాణం. కాని, ఈనాటి మానవుడు ఈ సత్యాన్ని తాను గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. దేనిని మనం పొందాలి? దేనిని విసర్జించాలి అనేటటువంటి సత్యం కూడను తనకు తెలియ లేకుండా పోతుంది. మనం మూడు విషయాలు మాత్రం చక్కగా గుర్తు పెట్టుకోవాలి. మనకి ఎవరు అపకారం చేశారో వారిని మనం ఉపయోగించుకోవాలి. ఎవరు మనకు అపకారం చేశారో వాళ్ళ విషయం మనం మర్చిపోవాలి. ఎవరికి ఉపకారం చేసినామో మనం ఇతరులకు, అది కూడా మనం మర్చిపోవాలి. జ్ఞప్తియందు ఉంచుకోవాల్సినటువంటివి జ్ఞప్తియందు ఉంచుకోవాలి. ఏది మనం జ్ఞప్తియందు ఉంచుకోవాలి? ఇతరులు మనకు ఉపకారం చేసినటువంటి దానిని జ్ఞప్తియందు ఉంచుకోవాలి. అదియే మనం నేర్చుకోవలసినటువంటిది. ప్రతిఫలాపేక్షతో మనం పెట్టుకోకూడదు. పవిత్రమైన భావంచేత, వాళ్ళు మనకు ఉపకారం చేశారు అనేటటువంటి దానికి కృతజ్ఞత మనం అందించాలి. ఈ కృతజ్ఞతకోసమే మానవ జీవితం వచ్చింది. 'శరీరమాద్యం-ఖలు ధర్మసాధనం'. ధర్మంను ఆచరించాలి. అది లేకపోతే మన శరీరమే అవసరం లేదు. ఏ కర్మలు అచరించినా ధర్మకార్యంగా మనం వినియోగించాలి. ఏ కర్మలు కూడను ఇవి ధర్మ కర్మలుగాను విశ్వసించాలి. ఈ విధమైనటువంటి భావాన్ని మనం హృదయంలో అభివృద్ధి పరచుకున్నపుడే అన్ని సార్థకం అయిపోతాయి. దైవాన్ని చింతించుకుంటూ ఏ కర్మలు చేసిన అవి అంతా పవిత్రం అయిపోతాయి. దీనినే 'సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం' అన్నారు. కనుక, మొట్టమొదట మనం ఈనాడు సమ్యక్ దృష్టిని పెంచుకోవాలి. మంచి దృష్టిని పెంచుకోవాలి. ఏ చెడ్డభావము కూడ మనలో రానీయకుండా

sri sathyasai vacharamrutam

చూసుకోవాలి. చెడును చూస్తే మన హృదయంలో అవి చిత్రించుకుంటూ పోతాయి. కాబట్టి మంచిని చూస్తు పోదాం, మంచిని వింటూ పోదాం, మంచిని తలుస్తూ పోదాం, మంచిని పలుకుతూ పోదాం. ఇదియే మానవ జీవితానికి అంత్యం.

**See no evil, see what is good,**
**Talk no evil, talk what is good**
**Hear no evil, hear what is good**
**Think no evil, think what is good**
**Do no evil, do what is good**
**This is the way to GOD.**

ఈ విధమైనటువంటి వాటిని మనం అనుసరించకుండా ఎప్పుడూ చెడు దృష్టి, చెడు శ్రవణము, చెడు మాటలు, చెడు ఆలోచనలు, చెడు కర్మలు. ఇంక ఎప్పుడు తరించేది? ఇవియే బుద్ధుడు బోధించినటువంటిది, సమ్యక్ దృష్టి, సమ్యక్ శ్రవణము, సమ్యక్ భావం, సమ్యక్ వాక్కు, సమ్యక్ క్రియ ఈ ఐదింటి ద్వారా మనం ఐదు ఇంద్రియములను సార్థకం గావించుకుంటే ఇంతకంటే మోక్షం మరొకటి లేదు. ఇదియే పవిత్రమైనటువంటి నిర్వాణం. ఈ నిర్వాణం అంటే ఏమిటి? మానసిక శాంతిలో తల లీనమై పోవటమే. ఏది మానసిక శాంతి? మానసికమైనటువంటిది కాదు peace. ఈ మానసికమైనటువంటిది pieces, pieces, pieces. హృదయశాంతి, ఈ హృదయలోని heart అంటే వేరుగా ఉంటుంది. దీనిని physical heart అంటారు. దీనిని హృదయం అనకూడదు. హృదయం అంటే ప్రత్యేకమైనటువంటి పేరు. హృత్+దయ=హృదయం. Compassion గా ఉండేటటువంటిది హృదయం. మన హృదయం ఎప్పుడు కూడను దయతో నిండి ఉండాలి, కరుణతో నిండి ఉండాలి, ప్రేమతో నిండి ఉండాలి. అప్పుడే నీ హృదయం పవిత్రమైనటువంటి మార్గాన్ని ప్రవేశిస్తుంది.

**మానవులంతా సోదరసోదరులే**

ప్రేమస్వరూపులారా! మనయందే ప్రేమస్వరూపుడై పరమాత్ముడు నిరంతరం ఉంటున్నాడు. మన ప్రేమకు మించినటువంటిది మరొకటి లేదు. 'ప్రేమనే దైవం-దైవమే

sri sathyasai vachanamrutam

ప్రేమ'. కనుక అట్టి ప్రేమస్వరూపుడిని మనం సరియైనటువంటి దృష్టిలో పెట్టుకున్నప్పుడే ఆది సమ్యక్ దృష్టి అవుతుంది. కనుక, మనం ప్రేమచేతనే మన జీవితాన్ని గడుపుదాము. మనకు ద్వేషులు అనేవారు ఎవ్వరు లేరు. నీకు నీవే ద్వేషుడు. నీకు నీవే మిత్రుడు. కనుకనే, నీవు భావించుకుంటే అది ద్వేషి అవుతాడు కాని, ద్వేషులు ఎవరు లేరు మనకు. అందరు brotherhood of man and fatherhood of God. అందరు అన్నదమ్ములే. అందరు అక్కచెల్లెండ్రే. ఎవ్వరికి భేదములు లేవు. ఇలాంటి భేదములు పెట్టుకోవడంచేతనే క్రోధం, ద్వేషం, అసూయ ఇలాంటి దుర్గుణములు మనలో ఆవిర్భవిస్తున్నాయి. అందరూ నా ప్రతిబింబమే అనుకుంటే ఎవ్వరిపైన కోపం రాదు. అయితే మానవునికి అంత సులభంగా ఇది లభ్యంకాదు. ఇవి అన్ని ఆచరణలో పెట్టాలి.

**శ్రేయోహి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే**
**ధ్యానాత్కర్మ ఫలత్యాగః త్యాగాచ్ఛాంతి రనంతరమ్.**

అభ్యాసం చేతనే మనం దీనిని త్యాగం చేసుకోవాలి. అభ్యాసం చేసుకుంటే అన్ని అలవాటై పోతుంది. ఈనాడు మనం పరుగెత్తుతున్నాము. పని చేస్తున్నాము; ఇది ఎక్కడనుంచి వచ్చింది? ఆచరణతోనే వచ్చింది. మాట్లాడుతున్నాం; ఇది ఎక్కడనుంచి వచ్చింది? ఆచరణలోనే వచ్చింది. ప్రతి క్రియ walking, reading, talking, eating, writing అన్ని ప్రాక్టీసుతోనే వస్తున్నాయి. ప్రతి దానికి కూడను మనం ప్రాక్టీసు చెయ్యాలి. ఆధ్యాత్మికంలో ఈ ఆచరణ ఏమిటి? దుర్గుణాన్ని దూరం చేసుకోవాలి, సద్గుణాన్ని పోషించుకోవాలి. చెడ్డభావాన్ని మర్చిపోవాలి. మంచి భావాన్ని పెంచుకోవాలి. ఇదియే నిజమైన సాధన. జపం, ధ్యానం చెయ్యటం కాదు. ఊరికే జపం చేసుకోవటం, మనస్సు మార్కెట్‌కి వెళ్ళుతుంది. ఇది కాదు సాధన. చెడ్డను మనం వదలి పెట్టాలి. మన హృదయమే దీనికి మూలస్థానం. మన మోక్షమునకు కూడను హృదయమే మూలస్థానం. మన కరుణకు హృదయమే మూలస్థానం. అన్నింటికి హృదయమే. కాని దురదృష్టవశాత్తు ఈనాటి మానవుడు దానిని నమ్మటం లేదు. దేవుడు తిరుపతిలో ఉన్నాడంటే పరుగెత్తి పోతున్నాము. దేవుడు భద్రాచలంలో ఉన్నాడంటే పరుగెత్తి పోతున్నాము. దేవుడు బద్రీనాథ్‌లో ఉన్నాడంటే పరుగెత్తిపోతున్నాము. దేవుడు హృదయంలోనే ఉన్నాడంటే నమ్మలేక పోతున్నాము. అదే

sri sathyasai vachanamrutam

ఒక చెడ్డ భావం. దగ్గర ఉన్నటువంటి వాటిని వదలిపెట్టి, దూరంగా ఉండేటటువంటి దేవుడు కోసం పరుగెత్తుతున్నాము. దూరంగా ఉండేటటువన్ని ప్రతిబింబాలే.

**నామస్మరణ జరిగేచోటనే నారాయణుడుంటాడు**

ఒకానొక సమయంలోపల నారదుడు నారాయణుని ప్రశ్నించాడు? స్వామి! నేను అప్పుడప్పుడు మీ దర్శనం కోసం వస్తుంటాను. మీరు ఎక్కడ ఉంటారు? మీ స్థానం ఎక్కడ అని అడిగాడు? 'మద్భక్తాః యత్రగాయన్తి తత్ర తిష్ఠామి నారద'. ఎక్కడ నా భక్తులు నన్ను స్మరిస్తుంటారో అక్కడ నేను ప్రతిష్ఠ అయివుంటాను. కైలాసం, స్వర్గం, వైకుంఠం ఇవన్నీ బ్రాంచి ఆఫీసులు కాని హృదయమే హెడ్ ఆఫీస్. అదియే మనము ఈనాడు తెలుసుకోవలసినది. ఆ హృదయాన్ని మనం తెలుసుకుంటే ఎక్కడ కూడా మనం పోలేము. ఆ మనస్సుని కూడా హృదయం వైపుకు మరచ్చుకుంటాం. నిరంతరం ఆనందాన్ని అనుభవిస్తాము. ఈ ఆనందం లేకుండా ఉండటానికి వీలే లేదు. హృదయం నుంచి వచ్చేదంతా ఆనందమే. చక్కెరనుంచి వచ్చేదంతా తీపియే! ఈ తీపి లేకుండా పోతే అది చక్కెర కానే కాదు. దేని ధర్మం దానికి ఉంటుంది. నిమ్మకాయ కోస్తే పులుపు వస్తుంది. దానికి అది సహజం. కాని ఆ నిమ్మకాయలో తీపి వచ్చిదంటే అది నిమ్మకాయ కాదు. అదే విధంగానే మన హృదయం నుంచి చెడ్డభావాలు వచ్చినాయంటే అది హృదయమే కాదు. హృదయం నుంచి మంచి భావాలు, పవిత్రమైన భావాలు, మధురమైన భావాలు వచ్చినప్పుడే అది హృదయం. కనుక, మనం హృదయం నుంచి మంచి భావాలు రావడానికి తగినటువంటి కృషి చెయ్యాలి. ఎలాంటి చెడ్డ భావాలు వచ్చిన కాని దానికి యేమాత్రం లెక్క చేయకుండా ఉండాలి. కనుక, మన హృదయాన్ని ఈనాడు సరియైనటువంటి పరివర్తన గావించుకోవాలి. మన భావాలను మనం మార్చుకోవాలి. ఈ చెడు భావాలను దూరం చేయాలి. కనుక మనం దివ్యమైన భావాన్ని పెంచుకోవాలి. ఇవన్నీ రావాలంటే ప్రేమ ఒక్కటే దీనికి మార్గం. కనుకనే ప్రేమతోనే మీరు జీవించండి.

**(తేదీ 11-05-1998న కొడైకెనాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vacharamrutam